సాక్షి నంద్యాల

శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గురువారం హైదరాబాద్‌కు చెందిన ఇ.చంద్రారెడ్డి రూ.1,00,116 విరాళంగా అందజేశారు.



దత్తాత్రేయుడికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్ : లోక కల్యాణం కోసం గురువారం శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు.



నకిలీలపై ఉక్కుపాదం!

నకిలీ పురుగు మందులపై వ్యవసాయాధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇప్పటికే దాదాపు రూ.70 లక్షల విలువ చేసే మందులను సీజ్ చేశారు.

8లో▸

న్యూస్‌రీల్

శ్రీశైలం చేరుకున్న సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయ పరిశీలన కోసం సెంట్రల్ వాటర్ కమిషన్ నిపుణులు గురువారం శ్రీశైలం ప్రాజెక్ట్‌కు చేరుకున్నారు. కృష్ణా, గోదావరి బేసిన్ మేనేజ్‌మెంట్ చీఫ్ ఇంజినీర్ రంగారెడ్డి, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ డైరెక్టర్ సంగమణి సీడబ్ల్యూసీ ఈఈ ప్రసాద్‌లు డ్యామ్ సందర్శన నిమిత్తం వచ్చారు. వారికి శ్రీశైలం డ్యామ్ ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి, ఈఈ మనోహర్‌రాజు స్వాగతం పలికారు. శుక్రవారం వీరు డ్యామ్‌ను సందర్శించనున్నారు.

రుణాల మంజూరులో లక్ష్యాలను అధిగమించాలి

ఆళ్లగడ్డ: పొదుపు సంఘాలకు రుణాల మంజూరులో బ్యాంకర్లు లక్ష్యాలను అధిగమించాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జేఎంఎల్‌బీసీ బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జగనన్న తోడు పథకం 12,737 మందికి రుణాలు ఇవ్వాల్సి ఉందన్నారు. అలాగే పొదుపు మహిళలు రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, ముద్ర రుణాల గురించి చర్చించారు. కార్యక్రమంలో డీపీఎం దానం, నంద్యాల ఇండస్ట్రీయల్ విభాగం అధికారి రవీంద్రనాథ్‌రెడ్డి, బ్యాంక్ లింకేజ్ కోఆర్డినేటర్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

7న వైద్యుల పోస్టులకు ఇంటర్వ్యూలు

నంద్యాలటౌన్: నూతనంగా ఏర్పాటు కాబోతున్న నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల, సర్వజన ఆసుపత్రిలో సీనియర్ రెసిడెంట్ వైద్యుల నియామకానికి ఈ నెల 7న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ. స్వర్ణలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఓబీజీ, అనస్తీషియా, ఆప్తమాలజీ, డెర్మటాలజీ, పల్మనాలజీ, రేడియాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పెథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వైద్యులు విద్యాభ్యాస్యం ఒరిజినల్, జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

ఉరుకుందలో 17 నుంచి శ్రావణ మాస ఉత్సవాలు



ఈరన్నస్వామి దేవాలయం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 14వ తేదీ వరకు శ్రావణమాస ఉత్సవాలు నిర్వహించనున్నారు. వేడుకల ఏర్పాట్లపై సమీక్షించేందుకు శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన పనులపై సమావేశంలో చర్చిస్తామన్నారు. అలాగే పారిశుద్ధ్య పనులు, హెల్త్ సెంటర్ల ఏర్పాటు, విద్యుత్ సమస్యలు లేకుండా చూడటం, భక్తుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు తిప్పడం..తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. ఉరుకుంద ఆలయ పరిధిలోని డార్మెటరీ హాల్‌లో నిర్వహించే సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని వారు కోరారు.

కరువును తరిమి.. వెలుగులు నింపి

- తెలుగు రాష్ట్రాలకు వర ప్రదాయినిగా శ్రీశైలం ప్రాజెక్ట్
- విద్యుదుత్పాదనతో పల్లెల్లో తొలగిన చీకట్లు
- కృష్ణమ్మ రాకతో కరువు నేల సస్యశ్యామలం
- జాతికి అంకితమై 39 ఏళ్లు పూర్తి

ఎందరో రైతులు, ప్రజల త్యాగఫలం.. ఇంజినీర్ల నైపుణ్యం.. శ్రమజీవుల కష్టం.. శ్రీశైల జలాశయం. ఒకే ఒక్క ప్రాజెక్ట్ తెలుగు రాష్ట్రాల రూపురేఖలే మార్చేసింది. గాఢాంధకారంలో ఉన్న పల్లెల్లో విద్యుత్ వెలుగులు విరజిమ్మాయి. పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. జలసిరులు కరువు నేలను తాకడంతో పసిడి పంటలు పండాయి. నిరుద్యోగ సమస్య తగ్గుతూ వచ్చింది. జీవనోపాధులు మెరుగుపడ్డాయి. శ్రామిక శిల్పులు చెక్కిన ఆధునిక దేవాలయంతోనే ఇదంతా సాధ్యమైంది. సరిగ్గా 39 ఏళ్ల క్రితం జాతికి అంకితమై కరువు నేలను సస్యశ్యామలం చేసి వెలుగులు నింపింది.

– శ్రీశైలంప్రాజెక్ట్



ప్రాజెక్ట్ శంకుస్థాపన శిలాఫలకం



శ్రీశైలం డ్యామ్ (ఫైల్)

గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ కాంతులు వెలగాలనే ప్రధాన కాంక్ష.. జలసిరులను అన్నదాత దరి చేర్చాలనే సంకల్పం.. జాతి ప్రగతి నదులపై ఆనకట్టల నిర్మాణంతోనే సాధ్యం.. అని నాటి పాలకులు, మేధావులు భావించడంతో శ్రీశైలం ప్రాజెక్ట్ (నీలం సంజీవరెడ్డి సాగర్ ప్రాజెక్ట్) రూపుదిద్దుకుంది. మల్లన్న పాదాల చెంత ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న కృష్ణానదిపై ఆనకట్ట నిర్మాణానికి ఆరవై ఏళ్ల క్రితం 1963 జూలై 24వ తేదీన నాటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్‌నెహ్రూ, నాటి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రి నీలం సంజీవ రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రముఖ ఇంజినీర్లు డాక్టర్ కేఎల్ రావు, జీఏ నరసింహారావు ఆధ్వర్యంలో ఎంతో మంది ఇంజనీర్ల బృందం రూపకల్పనతో ఈ బహుళార్థక సాధక ప్రాజెక్ట్‌కు తొలి అడుగు పడింది. 308 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో 904 అడుగుల టాప్ ఎలివేషన్, 470 అడుగుల ఫౌండేషన్‌తో నిర్మాణాన్ని ప్రారంభించారు. జలగర్భంలో ధృడమైన నిర్మాణం కోసం 1500 ఆర్‌పీఎం కాంక్రీట్ మిశ్రమాన్ని కలగలిపి కన్సాలిడేషన్ గ్రౌటింగ్‌తో నిర్మాణాన్ని చేపట్టారు. 5 నుంచి 17 టన్నుల బరువున్న శిలలను భారీ యంత్రాలతో, జవాలీలు అనే కూలీలతో నదిలో దింపి నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేసి డ్యామ్ నిర్మాణకట్టను



నిర్మాణంలో పాల్గొన్న శ్రామికులు (ఫైల్)

ప్రారంభించారు. నీటి మళ్లింపు తప్పనిసరి కావడంతో ఎడమవైపు డైవర్షన్ టన్నెల్ ద్వారా 20 వేల క్యూసెక్కులు, కుడివైపు డైవర్షన్ చానల్ ద్వారా 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదలయ్యేలా ఇంజినీర్లు చర్యలు తీసుకున్నారు. డ్యామ్ ఎగువ, దిగువ భాగాలలో రెండు కాఫర్‌డ్యామ్‌లను నిర్మించారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత నిర్మాణం పూర్తయింది. 1984 ఆగస్టు 3న నాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ జాతికి అంకితం చేస్తూ నీలం సంజీవరెడ్డి సాగర్ ప్రాజెక్ట్‌గా నామకరణం చేశారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి 38.47 కోట్ల వ్యయం అవుతుందని అంచనాలు వేసినప్పటికీ శ్రీశైలం డ్యామ్, కుడిగట్టు జలవిద్యుత్‌కేంద్రాల నిర్మాణం పూర్తయ్యే నాటికి రూ.404 కోట్లకు చేరుకుంది.

జలవిద్యుత్ కేంద్రాలు

జలాశయం కుడిగట్టు కేంద్రంలో ట్రాన్సిస్ డిజైన్‌లో ఒక్కొక్కటి 110 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయగలిగే 7 జనరేటర్లు, ఎడమగట్టు భూగర్భజల విద్యుత్ కేంద్రం ఒక్కొక్కటి 150 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయగలిగే రివర్సిబుల్ టెక్నాలజీ కలిగిన 6 జనరేటర్లతో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నిర్మించారు. జలాశయంలో నీరు తక్కువగా ఉన్న సమయంలో డ్యామ్ దిగువ భాగాన ఉన్న నీటిని మిగులు విద్యుత్‌తో తోడి డ్యామ్‌లోకి తెచ్చే విధంగా రూ.100 కోట్లతో టెయిల్‌పాండ్ డ్యామ్‌ను నిర్మించి, ఒక టీఎంసీ నీరు నిల్వ ఉండేలా చర్యలు



ఎడమ గట్టు జలవిద్యుత్‌కేంద్రం లోపలి భాగం

తీసుకున్నారు. 1982 నుంచి కుడిగట్టు కేంద్రంలో, 2000 నుంచి భూగర్భకేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల్లో వినియోగించే విద్యుత్‌లో 3/4వ వంతు రెండు పవర్‌హౌస్‌ల్లో ఉత్పత్తి అవుతోంది.

భారీ వరదలను తట్టుకునేలా..

శ్రీశైలం జలాశయం ప్రాంతంలో సాధారణంగా ఓ ఏడాదిలో 6.5 లక్షల క్యూసెక్కుల వరద ఉధృతి ఉంటుందని అంచనాలతో డ్యామ్ నిర్మాణాన్ని రూపకల్పన చేశారు. అయినప్పటికీ 1998లో ఒక్కసారిగా 8.90 లక్షల క్యూసెక్కులు, 2009లో ఒకే రోజు సుమారు 25.5 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చింది. 1998లో కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రం, 2009లో కుడిగట్టు జలవిద్యుత్‌కేంద్రం పూర్తి స్థాయిలో, భూగర్భ జలవిద్యుత్ కేంద్రం పాక్షికంగా దెబ్బతినింది. డ్యామ్ మాత్రం చెక్కు చెదరలేదు.

శ్రీశైల ప్రాజెక్ట్ భూసేకరణ

శ్రీశైలం డ్యామ్ నిర్మాణ క్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 52 గ్రామాలు, ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 65 గ్రామాలును ముంపు గ్రామాలుగా గుర్తించారు. వేలాది ఎకరాలు భూ సేకరణ చేశారు. ఎన్నో గ్రామాలు జలగర్భంలో కలిసిపోయాయి. చారిత్రక సంపద నీట మునిగింది. అక్కడి ప్రజలకు పునరావాసం కల్పించారు. ముంపు బాధితులకు నష్టపరిహారాన్ని అందజేయడంతో పాటు బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించారు.

వరద అంచనాకు సాంకేతిక పరిజ్ఞానం



నాటి ఇంజినీర్ల నైపుణ్యంతో నిర్మించబడిన శ్రీశైలం డ్యామ్ భారీ వరదలను తట్టుకుని నిలుస్తోంది. వరద ప్రమాద పరిస్థితులను అధ్యయనం చేసిన తర్వాత డ్యామ్ వద్ద, ఎగువ పరివాహక ప్రాంతాల్లో అత్యాధునిక టెలీమెట్రిక్ పరికరాలను అమర్చి ముందస్తు వరద ఉధృతిని అంచనా వేస్తున్నాం. భవిష్యత్‌లో ఎంతటి వరదలు వచ్చినా నీటిని దిగువకు వదిలేందుకు సిద్ధంగా ఉన్నాం.

– శ్రీరామచంద్రమూర్తి, ఎస్ఈ, శ్రీశైలం డ్యామ్

ప్రతి మెటీరియల్ టెస్ట్ చేసే వాళ్లు



జియాలజిస్టులు పరిశీలించి సర్టిపై చేసిన కాంక్రీట్ మిశ్రమాన్ని, రాయిని మాత్రమే శ్రీశైలం డ్యామ్ నిర్మాణంలో వాడేవారు. డ్యామ్ నిర్మాణం కూడా ఆర్క్ డిజైన్‌లో నిర్మించడం వలన వరద ప్రవాహ ఉధృతిని తట్టుకునే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఐదేళ్ల బ్యాచ్‌లర్ ఆఫ్ ఇంజనీరింగ్ చదివిన ఇంజినీర్లు, టెక్నీషియన్లు, కార్మికులు, ఉద్యోగులు పగలు, రాత్రి అంకిత భావంతో పనిచేసి శ్రీశైలం డ్యామ్‌ను నిర్మించారు.

– పి.భాస్కరమూర్తి, రిటైర్డ్ ఉద్యోగి, శ్రీశైలం ప్రాజెక్ట్

ప్రాజెక్టులకు జీవనాడి

శ్రీశైలం జలాశయంపై ఆధారంగా పలు ప్రాజెక్టులు నిర్మించారు. సీమ జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు తాగు, సాగునీరు అందించే శ్రీశైలం రైట్ బ్రాంచ్, శ్రీశైలం లెఫ్ట్ బ్రాంచ్ కెనాళ్లు, తెలుగు గంగ ప్రాజెక్ట్ దీనిలో భాగంగా చెన్నై మెట్రోపాలిటన్ సిటీకి తాగునీరు అందుతోంది. అలాగే హంద్రీనీవా, నాగార్జున సాగర్, పులిచింతల, గాలేరు నగరితో పాటు ఇప్పుడిప్పుడే పూర్తవుతున్న పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్‌లు శ్రీశైలం జలాశయం నీటి ఆధారంగానే నిర్మించారు.

6 నుంచి వందేభారత్ రైలు!

- హైదరాబాద్ నుంచి బెంగళూరుకు పరుగులు పెట్టనున్న సెమీ బుల్లెట్ ట్రైన్

వెల్దుర్తి: హైదరాబాద్, బెంగళూరు మధ్య వందే భారత్ రైలు ఈనెల 6 నుంచి పరుగులు పెట్టనుంది. అయితే అధికారికంగా ఇంకా ధ్రువీకరణ కాలేదు. కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల మీదుగా వెళ్తున్న ఈ సెమీ బుల్లెట్ ట్రైన్ సేవలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం వెల్దుర్తి పాతబస్టాండులో కర్నూలు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) ఇన్‌స్పెక్టర్ వి సత్యనారాయణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 600 కిలోమీటర్లు ప్రయాణం సాగించే ఈ రైలు వేగం ఎక్కువగా ఉంటుందని ఈ సమయంలో ఆకతాయిలు రాళ్లు విసిరినా, పశువులు పట్టాల సమీపానికి వచ్చినా ప్రమాదాలకు అవకాశాలుంటాయని, బాధ్యులపై



వందేభారత్ రైలు సేవలపై అవగాహన కల్పిస్తున్న కర్నూలు ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

రైల్వే చట్టాల మేరకు చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఏఎస్ఐ వి. స్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా.. ఈ రైలు ఉదయం కాచిగూడలో బయలుదేరి మధ్యాహ్నానికి బెంగళూరుకు చేరి, తిరిగి మధ్యాహ్నం అక్కడి నుంచి బయలుదేరి రాత్రి హైదరాబాద్‌కు చేరుకోనున్నట్లు విశ్వసనీయ సమాచారం. కర్నూలు, డోన్ స్టేషన్లలో ప్రారంభ రైలు రాకకు సంబంధిత అధికారులు స్వాగత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

విద్యుత్ జేఎల్‌ఎంలకు తీపి కబురు

కర్నూలు (రాజ్‌విహార్): విద్యుత్ శాఖలో గ్రేడ్–2 జూనియర్ లైన్‌మెన్లుగా పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. సచివాలయ వ్యవస్థను అమలులోకి తీసుకొచ్చే క్రమంలో వీరిని రాష్ట్ర ప్రభుత్వం 2019లో నియమించింది. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకుని ఎలాంటి రిమార్కులు లేని జేఎల్‌ఎంలను 2022 జూలై 1వ తేదీ నుంచి రెగ్యులర్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు గురువారం దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రూ.15 వేలుగా ఉన్న వీరి వేతనం రెట్టింపు కానుంది.

వీనుల విందుగా అష్టోత్తర పారాయణం



అష్టోత్తర పారాయణంలో భక్తులు

మంత్రాలయం: అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధ మంత్రాలయం రాఘవేంద్రస్వామి క్షేత్రంలో గురువారం అష్టోత్తర పారాయణం చేపట్టారు. ముందుగా పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ఊంజల మంటపంలో రాఘవేంద్రుల ప్రతిమకు విశేష పూజలు చేశారు. అనంతరం అనుగ్రహ సందేశంతో సామూహిక అష్టోత్తర పారాయణానికి అంకురార్పణ



ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న పీఠాధిపతి

పలికారు. భక్తజన సందోహం మధ్య మూడు గంటలకుపైగా పారాయణం కొనసాగింది. ఆధ్యాత్మిక చింతనకు ఇలాంటి పారాయణాలు దోహద పడుతుందని పీఠాధిపతి పేర్కొన్నారు. 500 మందికి పైగా పండితులు, సేవా భక్తులు, అంతరంగిక భక్తులు పాల్గొన్నారు.

ఆరాధనోత్సవాల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

రాఘవేంద్రస్వామి ఆరాధన సప్తరాత్రోత్సవాలు ఈనెల 29 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు చేతుల మీదుగా ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఆగస్టు 29 తేదీన ధ్వజారోహణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని పీఠాధిపతి తెలిపారు. పూర్వారాధన, మధ్యారాధనతోపాటు ఉత్తరారాధన సందర్భంగా సెప్టెంబర్ 3న మహారథోత్సవం ఉంటుందని వివరించారు. ఏటా మాదిరి అంగరంగ వైభవంగా ఉత్సవాలు జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులు విశేషంగా తరలివచ్చి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆకాంక్షించారు.

బిల్డప్ బాబు మాటలను ప్రజలు నమ్మరు

- రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ ఖాయం
- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా

మహానంది: దివంగత నేత వైఎస్సార్ హయాంలో ముచ్చుమర్రి ప్రాజెక్ట్ పనులు 95శాతం పూర్తయ్యాయని, ఐదుశాతం పనులు మాత్రమే చేసి బిల్డప్ కొడుతున్న చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మరని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. బండిఆత్మకూరు మండలం సంతజూటూరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు సాగునీటి ప్రాజెక్టులను విస్మరించి, 69 జీఓను రద్దుచేసి రాయలసీమ ద్రోహిగా చరిత్రలో నిలిచారని విమర్శించారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు సామర్థ్యాన్ని 11వేల క్యూసెక్కుల నుంచి 44వేల క్యూసెక్కులకు వైఎస్సార్ పెంచారని, పెద్దమనసుతో సీఎం జగన్ 80 వేల క్యూసెక్కులకు పెంచిన విషయం అందరికీ తెలుసని గుర్తు చేశారు. ఓటుకు నోటు కేసులో భయపడి తెలంగాణ వారిని ప్రశ్నించలేని నువ్వు ఏపీని సింగపూర్ చేస్తానంటే ఎలా నమ్ముతారంటూ ప్రశ్నించారు. గడపగడపకు మనప్రభుత్వం, జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలతో మమేకమవుతుందని స్పష్టం చేశారు. ఇటీవల ప్రారంభించిన జగనన్న సురక్షద్వారా ఒకేరోజు 7.54 లక్షల పత్రాలు అందించి దేశంలోనే సరికొత్త రికార్డు సృష్టించామన్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో 41,323 అభ్యర్థనలు రాగా 40,102 మందికి పత్రాలు ఇచ్చామని, 97శాతం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

పరిష్కరించినట్లు స్పష్టంచేశారు. ఎన్నికల సమయంలో ప్రజల ఇళ్లవద్ద వచ్చి ఓట్లు అడగాలంటే భయపడేపరిస్థితి ఉండేదని, కానీ నేడు ధైర్యంగా వెళ్లే పరిస్థితి కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కరుడుగట్టిన టీడీపీ నేతలు సైతం వైఎస్సార్‌సీపీ వైపు ఆకర్షితులవుతున్నారన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన.. ఎన్నిపార్టీలు కలిసొచ్చినా వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. సమావేశంలో సీనియర్ నేత శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకట్రామిరెడ్డి, కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఏపీ షీప్స్ డైరెక్టర్ కాకనూరు సుబ్బయ్యయాదవ్, జేసీఎస్ ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీబీ డ్యాంలో 84 టీఎంసీల నీరు



జలకళతో డ్యామ్

హొళగుంద: తుంగభద్ర జలాశయంలో గురువారం సాయంత్రం సమయానికి 84 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 17,927 క్యూసెక్కుల కొనసాగుతుండగా ఆర్‌బీసీకి, హెచ్ఎల్సీ, పవర్‌కెనాల్ (ఎల్లెల్సీ) తదితర కాలువలకు 4,014 క్యూస్కెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దిగువ కాలువ (ఎల్లెల్సీ)లో ఆంధ్ర–టీబీ బోర్డు కాలువ సరిహద్దు 250 కి.మీ వద్ద 400 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

‘ఆడుదాం ఆంధ్రా’కు సన్నద్ధం

- గ్రామస్థాయి నుంచి క్రీడా పోటీల నిర్వహణకు ఏర్పాట్లు
- మండలాల వారీగా ఇన్‌చార్జ్‌ల నియామకం
- విజేతలకు నగదు బహుమతులకు నిర్ణయం

నంద్యాల(న్యూటౌన్): విద్యతో పాటు క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుంది. గ్రామ స్థాయి నుంచి క్రీడాకారులను తయారు చేయాలనే లక్ష్యంతో ‘ఆడుదాం ఆంధ్ర’ కార్యక్రమాన్ని చేపట్టింది. అక్టోబర్‌లో ప్రారంభం కానున్న పోటీలకు సంబంధించిన జిల్లాలో ఏర్పాట్లు మొదలయ్యాయి. 17 ఏళ్లు పైబడిన యువతి యువకులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. నంద్యాల జిల్లాలో 516 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు గ్రామ, వార్డు స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు మండలాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించారు. వీరు క్రీడా పాఠశాల మైదానాల ఎంపిక చేయడంతో పాటు పీఈటీ, పీడీ, ప్రధానోపాధ్యాయుల వివరాలు సేకరించారు. అంపైర్ల వివరాలను ఈనెల 30లోగా నమోదు చేయనున్నారు. జిల్లా స్థాయిలో అంబాసిడర్స్, అత్యుత్తమ క్రీడాకారులను ఎంపిక చేస్తారు. పోటీలను ముందుగా గ్రామ, పట్టణాల్లోని వార్డు స్థాయిలో నిర్వహిస్తారు. తర్వాత మండల, పట్టణ నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు విజేతలకు క్రీడా పరికరాలు, నియోజకవర్గ జిల్లా,



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

రాష్ట్రస్థాయి విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారు. వాలీబాల్ జట్టులో 6 నుంచి 12 మంది, కబడ్డీ జట్టులో 7 నుంచి 12 మంది, ఖోఖో జట్టులో 9 నుంచి 12 మంది, క్రికెట్ జట్టులో 11 నుంచి 16 మంది, బ్యాడ్మింటన్ జట్టులో ఇద్దరు చొప్పున క్రీడాకారులు ఉంటారు. పోటీల ఇన్‌చార్జ్‌లుగా గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, ఏఈ, ఈఓఆర్‌డీలు వ్యవహరిస్తారు.

బహుమతులు ఇలా..

పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ విజేతలకు నియోజకవర్గ స్థాయిలో రూ.20 వేలు ప్రథమ, రూ.10 వేలు ద్వితీయ, జిల్లా స్థాయిలో రూ.50 వేలు ప్రథమ , రూ.30 వేలు ద్వితీయ, రూ.20వేలు తృతీయ బహుమతి అందించనున్నారు. అలాగే రాష్ట్రస్థాయి పోటీల్లో బ్యాడ్మింటన్ విజేతలకు రూ.లక్ష ప్రథమ, రూ.50 వేలు ద్వితీయ, రూ.30 వేలు తృతీయ బహుమతి అందిస్తారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ విజేతలకు ప్రథమ బహుమతి రూ.5 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.3లక్షలు, తృతీయ బహుమతి రూ.2లక్షలు అందజేస్తారు.

ఉత్తమ మస్కట్ లోగోకు బహుమతులు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘ఆడుదాం ఆంధ్ర’ క్రీడా పోటీల మస్కట్ లోగోకు ప్రథమ బహుమతి రూ.50 వేలు ఇస్తున్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలకు మస్కట్ లోగో డిజైన్ చేయాలని, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ అంశాల్లో పోటీలు చేపడుతారని వివరించారు. వీటితో పాటు నాన్ కాంపిటీషన్ విభాగంలో యోగా, మారథాన్‌తో పాటు అయా ప్రాంతాల్లో సంప్రదాయ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ మస్కట్ లోగో డిజైన్ చేసి వారికి ప్రథమ బహుమతితో పాటు రెండో బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20వేలు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ అందిస్తుందన్నారు. నంద్యాల జిల్లాలోని విద్యార్థులు, క్రీడాకారులు, పోటీ దారులు ఆన్‌లైన్‌లో https://soprts.ap.gov.in లో ఆగస్టు 1వ తేదీ నుండి 7వ తేదీలోగా డిజైన్ పంపాలన్నారు. మరింత సమాచారం కోసం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్యశిక్షకుడు ఫోన్‌నెం.9885240365కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

పోటీల నిర్వహణకు కసరత్తు



ఆడుదాం.. ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. పోటీలను అక్టోబర్ 2వ తేదీన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తారు. ఐదు రకాల క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నాం. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలి. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడంతో ఎంతో మంది ఉత్తమ క్రీడాకారులుగా రాటుదేలనున్నారు.

– రాజు, జిల్లా క్రీడా సాధికారత కో ఆర్డినేటర్, నంద్యాల

పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తాం



రామచంద్రారాయ్ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: మృతి చెందిన పోలీస్ కుటుంబాలకు అండగా నిలుస్తామని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక హోంగార్డ్ యూనిట్‌లో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన డి. రామచంద్రరాయ్ కుటుంబానికి ఎస్పీ రూ. 10 వేల చెక్కును అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. మృత్యువాత పడిన పోలీస్ కుటుంబ సభ్యులు ఎలాంటి సహాయం కావాలన్నా జిల్లా పోలీసు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వారికి పోలీస్ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఎస్పీతో పాటుగా ఆర్ఐ సుధాకర్, హోంగార్డ్ ఇంచార్జ్ తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

మూడు కాలనీల్లో చోరీ

కర్నూలు: నగరంలోని మూడు కాలనీల్లో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడ్డారు. ఊరు వెళ్లి వచ్చేసరికి ఉన్నదంతా మూటగట్టుకుని ఉడాయించడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. కల్లూరులోని శాంతినికేతన్ స్కూల్ వెనుక నివాసముంటున్న వేణుగోపాల్ శెట్టి గత నెల 28న ఇంటికి తాళం వేసి స్వగ్రామం గోనెగండ్ల మండలం కులుమాలకు కుటుంబ సభ్యులతో కలసి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు కిటికీ అద్దాలు పగులగొట్టి లోపలకు వెళ్లి బీరువాలోని 11 తులాల బంగారం, రూ.లక్ష నగదును మూటగట్టుకుని ఉడాయించారు. వేణుగోపాల్ శెట్టి 1వ తేదీ ఇంటికి వచ్చి చోరీ జరిగిన విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఉద్యోగ నగర్‌లో..

దిన్నెదేవరపాడు ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం సరశమ్మ ఉద్యోగ నగర్‌లో నివాసముంటారు. కుటుంబ సభ్యులకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో రెండు వారాల క్రితం ఇంటికి తాళం వేసి తిరుపతికి వెళ్లారు. దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న 12 తులాల బంగారు నగలను మూటగట్టుకుని ఉడాయించారు. తిరిగి వచ్చిన సరశమ్మ లబోదిబో మంటూ నాల్గవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మెడికల్ షాపులో..

చిదంబరరావు వీధిలో మెడికల్ షాపులో దొంగలు పడి రూ.30 వేలు నగదుతో ఉడాయించారు. దుకాణం నిర్వాహకుడు కె.వి.సత్యనారాయణ బుధవారం రాత్రి వ్యాపారం ముగించుకుని దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. తెల్లవారుజామున దొంగలు షట్టర్ పెకిలించి టేబుల్ డ్రాయర్‌లో ఉన్న రూ.30 వేలు తస్కరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీలపై ఉక్కుపాదం!

- రూ.70 లక్షల విలువ చేసే పురుగుమందుల సీజ్
- జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా తనిఖీలు
- క్రిమినల్ కేసులు నమోదు చేస్తామంటున్న వ్యవసాయాధికారులు



ఎమ్మిగనూరులో బయటపడిన నకిలీ పురుగుమందులు



తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): నకిలీ పురుగు మందులపై జిల్లా వ్యవసాయాధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇప్పటికే దాదాపు రూ.70 లక్షల విలువ చేసే మందులను సీజ్ చేశారు. డీలర్లపై 420తో పాటు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన ఆదేశాల మేరకు కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోనిల్లో తనిఖీలకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలోని బృందం ఇటీవల ఎమ్మిగనూరులో నిర్వహించిన తనిఖీల్లో నకిలీ పురుగుమందులు బయటపడ్డాయి.

సర్వీస్ శ్యాంపుల్స్..

ఎమ్మిగనూరులోని సాయి బాలాజీ ట్రేడర్స్, పంచముఖి ట్రేడర్స్‌ల్లో ఇటీవల స్క్వాడ్ ఏడీఏ వెంకటేశ్వర్లు తనిఖీలు నిర్వహించారు. వీటిల్లో చాలా వరకు పురుగుమందులకు సోర్స్ సర్టిఫికెట్స్ లేకపోవడం, ఇతర వివరాలు లేకపోవడంతో మొదట విక్రయాలు ఆపివేయించారు. తర్వాత 12 సర్వీస్ శ్యాంపుల్స్ తీసి కర్నూలులోని పురుగుమందుల నాణ్యతా ప్రమాణాల పరీక్షల ల్యాబ్‌కు పంపారు. ల్యాబ్‌లో సర్వీస్ శ్యాంపుల్స్‌ను పరీక్షించంగా వీటిల్లో పురుగు మందుల శాతం అతి తక్కువగా ఉన్నట్లు నిర్ధారించారు. నకిలీ పురుగుమందులని వెల్లడి కావడంతో వెంటనే సంబంధిత కంపెనీల ప్రతినిధులను కూడా పిలిపించారు. కంపెనీల ప్రతినిధులు వచ్చి పురుగు మందులను పరిశీలించి ఇవి తమ కంపెనీలకు సంబంధించిన ఉత్పత్తులు కాదని, నకిలీలను తేల్చారు. నకిలీ పురుగుమందులను లైసెన్స్ కలిగిన దుకాణంలోనే అమ్మకానికి పెట్టడాన్ని వ్యవసాయ శాఖ తీవ్రంగా పరిగణిస్తోంది.

బ్రాండెడ్ పేరుతో మోసం

బ్రాండెడ్ కంపెనీలు, వాటి ఉత్పత్తుల పేరుతోనే నకిలీలను అమ్మకానికి పెట్టినట్లు స్పష్టమవుతోంది. సాయి బాలాజీ ట్రేడర్స్‌లో దాదాపు రూ.65 లక్షలు, పంచముఖి ట్రేడర్స్‌లో దాదాపు రూ.4 లక్షల విలువ నకిలీ పురుగుమందులను వ్యవసాయ అధికారులు సీజ్ చేశారు. సాయి బాలాజీ ట్రేడర్స్‌లో 280 కిలోల అసిఫేట్, 1980 లీటర్ల మోనోక్రోటోఫాస్, కార్బోఫ్యూరాన్ 6060 కిలోలు, ఫిప్రోనిల్ 600 లీటర్ల, 3960 లీటర్ల క్లోరోఫైరిపాస్ పురుగు మందులను వ్యవసాయ అధికారులు సీజ్ చేశారు. భారత్ పెస్ట్ కెమికల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ పేరుతో మోనోక్రోటోఫాస్, ఫిప్రోనిల్, అసిఫేట్, కార్బోఫ్యూర్యాన్, పీఆర్ ఆగ్రో కెమికల్స్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో అసిఫేట్, గౌతమీ కెమికల్స్ అండ్ పెస్టిసైడ్ పేరుతో కార్బోఫ్యూరాన్, క్లోరోపైరిపాస్ పేర్లతో నకిలీలు ఉండటం గమనార్హం.

బేయర్ కంపెనీ పేరుతో నకిలీలు

బేయర్ కంపెనీ పేరుతో కూడా నకిలీ పురుగు మందులు లభించాయి. ఎమ్మిగనూరులోని పంచముఖి ట్రేడర్స్‌లో బేయర్ కంపెనీ పేరుతో మూడు రకాల నకిలీ పురుగు మందులను గుర్తించారు. ఇమా మెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాముల డబ్బాలు 400, నెటివో(ఎస్‌ఏటీఐవీవో) ఒక డబ్బా, ఫిప్రోనిల్ 40 గ్రాముల డబ్బాలు 15 (జంప్) , కార్బోఫ్యూరిన్ 60కిలోలు, నకిలీ పురుగుమందుల నిల్వలను గుర్తించి సీజ్ చేశారు. వీటి విలువ దాదాపు రూ.4 లక్షలు ఉన్నట్లు తెలుస్తోంది. నకిలీ కంపెనీల అడ్రస్‌లు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పేర్లతో ఉన్నాయి. అయితే వీటిపై సంబంధిత డీలర్లు నోరు విప్పడం లేదు. ఎటువంటి వివరాలు వెల్లడించడం లేదు. పోలీసుల విచారణలోనే నకిలీలపై వివరాలు బయటికి వచ్చే అవకాశం ఉంది. ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో మహేశ్వరరెడ్డి విచారణ జరుపుతున్నారు.

ఇంకా ఎక్కడైన ఉన్నాయా?

ఎమ్మిగనూరులో పెద్ద ఎత్తున నకిలీ పురుగు మందలు బయటపడటంతో వ్యవసాయ యంత్రాంగం అప్రమత్తం అయింది. నకిలీ పురుగుమందులు ఎమ్మిగనూరులోనే ఉన్నాయా... ఇంకా ఎక్కడైన ఉన్నాయా.. అనే దానిపై దృష్టి సారించారు. సమగ్రంగా తనిఖీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. నకిలీలకు ఎమ్మిగనూరు, ఆదోనిలు మొదటి నుంచి పెట్టింది పేరు. ఆదోని మండలం పెసలబండ గ్రామంలో గత ఏడాది దాదాపు రూ.7 లక్షల విలువ నకిలీ బయోపెస్టిసైడ్స్ పట్టుపడ్డాయి. తాజాగా ఎమ్మిగనూరులో బ్రాండెడ్ కంపెనీల పేరుతో నకిలీ పురుగుమందులు భారీగా పట్టుపడ్డాయి. దీంతో వ్యవసాయ అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు.

కఠినంగా వ్యవహరిస్తున్నాం



నకిలీ పురుగు మందులపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఎమ్మిగనూరులోని సాయి బాలాజీ ట్రేడర్స్, పంచముఖి ట్రేడర్స్‌ల్లో వివిధ కంపెనీల పేర్లతో ఉన్న నకిలీ పురుగు మందులను సీజ్ చేశాం. క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయించాం. నకిలీ పురుగు మందులు, కంపెనీల పురుగుమందులను ఎలా గుర్తించాలనే దానిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. – **పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు**

క్లుప్తంగా

డ్వామా కార్యాలయ ఏవోగా విజయలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్(ఏఓ)గా ఎం.విజయలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల జిల్లా నీటియాజమాన్య సంస్థ కార్యాలయంలో ఏపీవో(అకౌంట్స్)గా పనిచేస్తున్న ఈమెను కర్నూలు డ్వామా పీడీ కార్యాలయ పరిపాలనా అధికారిగా నియమించారు. ముందుగా ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నాగేశ్వరరావు ఆదోని డివిజన్ డెవలప్‌మెంట్ అధికారిగా బదిలీ అయ్యారు. ఆదోని డీఎల్‌డీవోగా పనిచేస్తున్న రామలింగేశ్వరరెడ్డి నంద్యాల జిల్లా డ్వామా ఏపీవో(అకౌంట్స్)గా నియమితులయ్యారు.

అమరావతికి రావాలని డీఈఓకు నోటీసు

కర్నూలు కల్చరల్: విద్యార్థులకు సక్రమంగా పాఠాలు చెప్పించడం లేదు.. ఉపాధ్యాయులు విద్యార్థులచే హోం వర్క్ చేయించ లేకపోతున్నారు.. విద్యార్థుల నోట్ పుస్తకాల్లో ఉపాధ్యాయులు సంతకాలు చేయడం లేదు.. పాఠశాల విద్యలో పర్యవేక్షణ లోపించింది.. వీటిపై వివరణ ఇవ్వడానికి అమరావతికి రావాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.రంగారెడ్డికి విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ నోస్ జారీ చేశారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలోని పాఠశాలల్లోని కొందరు విద్యార్థులతో ప్రిన్సిపల్ సెక్రటరీ ఫోన్‌లో మాట్లాడారు. ఉపాధ్యాయులు హోం వర్క్ చేయించడం లేదు, నోట్‌పుస్తకాల్లో సంతకాలు చేయడం లేదనే విషయాలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డీఈఓ రంగారెడ్డితో పాటు ఆస్పరి మండల పరిధిలోని చుక్కన హళ్లిలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉపాధ్యాయున్ని సైతం అమరావతికి వచ్చి వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నట్లు తెలిసింది. దీంతో డీఈఓ హుటాహుటిన అమరావతి బయలుదేరారు. అమరావతి సమీపిస్తుండగానే డీఈవో కుటుంబ సభ్యుల్లో ఒకరు చనిపోయినట్లు ఆయనకు ఫోన్ రావడంతో అక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లిపోయారు.

జిల్లాలో 1,305 సాధారణ పంట కోత ప్రయోగాలు



మాట్లాడుతున్న పీఎల్ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో 2023–24 సంవత్సరానికి సాధారణ పంట కోత ప్రయోగాలు 1,305 చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో పంట కోత ప్రయోగాల నిర్వహణపై ఏవో, ఏఎస్‌వోలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఖరీఫ్‌లో వరికి గ్రామం యూనిట్‌గా, రబీలో శనగకు దిగుబడి ఆధారిత బీమా ఉందన్నారు. మండలం యూనిట్‌గా మొక్కజొన్న, కంది, జొన్న, మిర్చి, ఆముదం, జిల్లా యూనిట్‌గా సజ్జ, కొర్ర పంటలకు దిగుబడి ఆధారిత బీమా సదుపాయం ఉందని తెలిపారు. జిల్లా ప్రణాళిక అధికారి అప్పలకొండ మాట్లాడుతూ...దిగుబడి ఆధారిత బీమా కోసం చేపట్టాల్సిన పంటకోత ప్రయోగాల కోసం లక్ష్యాలను త్వరలోనే ఇస్తామన్నారు. సమావేశంలో జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు, వ్యవసాయ శాఖ ఏడీఏలు, ఎస్‌వో, ఏఎస్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి రూ.1.6 లక్షల ఆర్థిక సాయం



రెడ్డిగారి మేఘనకు రూ.1.60 లక్షల చెక్కును అందజేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: ఆసియా కప్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్న సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి రెడ్డిగారి మేఘనకు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గురువారం తన నివాసంలో రూ.1.60 లక్షల చెక్కును అందజేశారు. కర్నూలు నగరానికి చెందిన ఆర్. తిరుమలేశ్వర రెడ్డి కుమార్తె మేఘన సాఫ్ట్‌బాల్ క్రీడలో రాణిస్తోంది. ఈనెల 29 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు చైనా దేశంలో జరిగే ఆసియా కప్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఈమె పాల్గొననుంది. క్రీడాకారిణి మేఘనను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అభినందించి, రూ.1.60 ఆర్థిక సాయాన్ని అందజేశారు. విజేతగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.

అక్కంపల్లెలో విద్యార్థి మృతి



మృతి చెందిన గణేష్

సంజామల: అక్కంపల్లె గ్రామానికి చెందిన 7వ తరగతి విద్యార్థి గణేష్(12) గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఎస్ఐ ప్రతాప్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రామలింగయ్య కుమారుడు నొస్సం పాఠశాలలో చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం గణేష్ తన స్నేహితులతో కలసి డ్రాగన్ ఫ్రూట్స్ కోసం నయనాలప్ప క్షేత్ర సమీపంలోని తోటలోకి వెళ్లాడు. తిరిగి వస్తుండగా గణేష్ స్పృహ తప్పి పడిపోయాడు. స్నేహితులు వెంటనే కుటుంబీకులు సమాచారం అందించడంతో స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందించారు. కోలుకున్న గణేష్ గురువారం తెల్లవారుజామున రక్తపు వాంతులు చేసుకోవడంతో వెంటనే జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. తోటలో పాముకాటుకు గురై వుండచ్చు అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్ తెలిపారు.

చంద్రబాబు అంటేనే కరువు!

- మంత్రి గుమ్మనూరు జయరాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: చంద్రబాబు అంటేనే కరువని, ఆయన ఎక్కడ కాలు మోపితే అక్కడ దుర్భిక్షం తాండవిస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ఆలూరులోని తన నివాసంలో గురువారం మంత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనా కాలంలో 2014 నుంచి 2019 వరకు వర్షాలు కురువక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. 2019లో ఆలూరు మండలం కురువెళ్లి గ్రామ సభలో వేదావతి ప్రాజెక్టు పనులకు రూ. 250 కోట్లు మంజూరు చేస్తానని చంద్రబాబు మాట ఇచ్చి తప్పారన్నారు. చిప్పగిరి మండలం నగరడోణ సమీపంలో ప్రాజెక్టు నిర్మాణ పనులకు నిధులు కేటాయించకుండా కాలయాపన చేశారన్నారు. వేదావతి ప్రాజెక్టు పనులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 1800 కోట్లను మంజూరు చేశారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. అనేక రకాలుగా ప్రజలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం తగదన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ కో– ఆర్డినేటర్ నారాయణస్వామి, హొళగుంద మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ మల్లికార్జున, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాంభీమ్‌నాయుడు, ఎంపీటీసీ దేవరాజ్, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

సీమ జోన్ ఎక్సైజ్ డీసీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన శ్రీలత

కర్నూలు: ఎక్సైజ్ శాఖ రాయలసీమ జోన్ డిప్యూటీ కమిషనర్‌గా నియమితులైన బి.శ్రీలత విధుల్లో చేరారు. ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్న ఈ స్థానంలో ఇన్‌చార్జిగా ఉన్న మునుస్వామి నుంచి ఆమె గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లాకు చెందిన ఈమె 2007లో ఏఈఎస్ హోదాలో ఎక్సైజ్ శాఖలో చేరి డిప్యూటీ కమిషనర్ హోదాలో ఎదిగారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, సీఐలు రాజశేఖర్ గౌడ్, పద్మావతి, రాముడు తదితరులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు.

సెబ్ నుంచి ఎక్సైజ్‌కు మరికొందరు సీఐలు బదిలీ

సెబ్ ఏర్పాటైన తర్వాత మొదటిసారిగా ఆ విభాగంలో పనిచేస్తున్న కొంతమంది సీఐలను ఎక్సైజ్ విభాగానికి బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. సెబ్ విభాగం ఏర్పాటై మూడేళ్లు పూర్తయిన సందర్భంగా సెబ్ నుంచి ఎక్సైజ్‌కు, అక్కడినుంచి సెబ్‌కు మారుస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇందులో భాగంగా ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు సీఐలు హరికృష్ణ, జయరాం నాయుడు, ఎర్రా వెంకట్, ఎమ్మిగనూరు మొబైల్ పార్టీ సీఐ దశరథరామిరెడ్డి, టాస్క్‌ఫోర్స్ సీఐ రాజశేఖర్ గౌడ్ తదితరులను ఎక్సైజ్ విభాగానికి అలాట్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే సరైన మార్గ దర్శకాలు లేకుండా బదిలీ చేపట్టారంటూ కొంతమంది కోర్టును ఆశ్రయించడంతో ఈ బదిలీలపై స్టేటస్కో ఆర్డర్ వెలువడినట్లు సమాచారం.

వ్యక్తి ఆత్మహత్య

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని నూర్‌షావలి దర్గా సమీపంలో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. గురువారం ఎస్ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. కోవెలకుంట్ల మండలం గుళ్లదూర్తి గ్రామానికిచెందిన జయచంద్ర(54)అనే వ్యక్తి దర్గా సమీపంలోని మర్రి చెట్టుకు చీరెతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడా, ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే విషయాలు పోలీసుల విచారణలో వెల్లడి కావాల్సి ఉంది. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): భారత ప్రభుత్వ గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరానికి గిరిజన విద్యార్థులకు నేషనల్ ఫెలోషిప్, స్కాలర్‌షిప్‌ను అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమాధికారి జగన్నాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ ఎంఫిల్ ప్లస్ పీహెచ్‌డీ చేస్తున్న గిరిజన విద్యార్థులు ఈనెల 31లోగా https:// fellowship. tribal. gov. in లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

6న క్రికెట్ జట్టు ఎంపిక

కర్నూలు(రూరల్): ఔట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 6వ తేదీన జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కర్నూలు జిల్లా క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దేవేంద్ర గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఒకటవ తేదీ సెప్టెంబర్ 2009 నుంచి 31 ఆగస్టు 2011 మధ్య జన్మించిన ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 9959251047ను సంప్రదించాలన్నారు.

కలెక్టరేట్ పనులకు టెండర్ల గడువు పొడిగింపు

కర్నూలు (న్యూసిటీ): కలెక్టరేట్‌లో మరమ్మతులకు గురైన భవనాలకు ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టేందుకు పిలిచిన టెండర్ల గడువును ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు పొడిగించారు. కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల కార్యాలయాల్లో రూ.8.08 కోట్లతో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారు. ఈ నెల 4 వరకు టెండర్లలో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. అయితే కాంట్రాక్టర్ల మధ్య పోటీ పెంచేందుకు 7వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఎస్‌ఈ నాగరాజు తెలిపారు.

సోషల్ ఆడిట్‌కు 'సూక్ష్మసేద్యం' వివరాలు

కర్నూలు(అగ్రికల్చర్): 2022–23లో బిందు, తుంపర్ల సేద్యం పొందిన రైతుల వివరాలను ఏపీఎంఐపీ అధికారులు సోషల్ ఆడిట్ కోసం రైతుభరోసా కేంద్రాల్లో ఉంచారు. గత ఏడాది 4,584 మంది రైతులకు 4,509 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్య సదుపాయం కల్పించారు. ఆర్‌బీకేల వారీగా సూక్ష్మ సేద్యం పొందిన రైతుల వివరాలను ప్రదర్శనకు పెట్టారు. అభ్యంతరాలు ఉంటే ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లకు ఫిర్యాదు చేయవచ్చని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి తెలిపారు. ఇప్పటి వరకు రైతుల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదని పేర్కొన్నారు. రైతుల సూచన మేరకు 18.73 ఎకరాలకు మంజూరు చేసిన సూక్ష్మ సేద్యం మంజూరును రద్దు చేసినట్లు చెప్పారు.

'జీజీఎంపీ' నిధుల వినియోగంలో ప్రథమం

- జిల్లాలో రూ.46.24 కోట్లతో 959 పనులు పూర్తి
- ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల మంజూరు
- కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ నుంచి మానిటరింగ్ చేస్తున్న కలెక్టర్
- గ్రామీణ, పట్టణాల్లో మౌలిక నదుపాయాల కల్పనకు పెద్దపీట



కర్నూలు నగరం బుధవారపేటలో సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం



16వ సచివాలయ పరిధి గురునానక్ దేవాలయం సమీపంలో వేసిన సీసీ రోడ్డు

కర్నూలు(సెంట్రల్): గడప గడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) కార్యక్రమంలో నిధుల వినియోగంలో కర్నూలు జిల్లా రాష్ట్రంలో ప్రథమంగా నిలిచింది. రూ.46.24 కోట్లతో రికార్డు స్థాయిలో 959 పనులను పూర్తి చేశారు. మరికొన్ని పనులు వివిధ స్థాయిలో ఉన్నాయి. కర్నూలు తరువాత మాన్యం, కోనసీమ, తిరుపతి జిల్లాలు ఉన్నాయి.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం..

కర్నూలు జిల్లాలో 672 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో సచివాలయం పరిధిలో సీసీరోడ్లు, డ్రెయిన్‌లు, మంచి నీరు, ఇతర పనుల కోసం రూ.20 లక్షలను మంజూరు చేసింది. ఆ లెక్కన జిల్లాకు రూ.134 కోట్ల నిధులు మంజూరు అవుతాయి. అయితే ప్రజాప్రతినిధులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇళ్లిళ్లు, వీధి వీధులు తిరిగిన తరువాత ప్రజల నుంచి వచ్చిన విన్నపాల మేరకు పనులను మంజూరు చేయాల్సి ఉంది. ఈ క్రమంలో ఇప్పటి వరకు 981 పనులకు కలెక్టర్ అనుమతి ఇచ్చారు. ఇందులో 959 పనులు పూర్తి కాగా, 226 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మిగిలిన 22 పనులు ప్రారంభంకావాల్సి ఉంది. కాగా, ఇప్పటి వరకు చేపట్టిన పనులకు రూ.46.24 కోట్లను చెల్లించడంతో నిధుల వినియోగంలో కర్నూలు మొదటిస్థానంలో నిలిచింది.

కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షణ..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని జిల్లా అధికార యంత్రాంగం సీరియస్‌గా తీసుకుంది. మంజూరైన నిధులను గ్రామాల్లోని కాలనీలు, పట్టణాల్లోని వీధుల్లో మౌలిక సదుపాయాలను ప్రణాళికాబద్ధంగా చేపట్టడానికి కలెక్టర్ నేతృత్వంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కమాండ్ కంట్రోల్ రూమ్ సీపీఓ జేడీ అప్పలకొండ ఆధ్వర్యంలో పనిచేస్తోంది. ఈ క్రమంలో ఆయన ఉదయం, సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వంపై ఎంపీడీఓలు, తహసీల్దార్లతో నిరంతరం సమీక్షించారు. కలెక్టర్ డాక్టర్ సృజన క్షేత్రస్థాయి తనిఖీలకు వెళ్లిన సమయంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలపై తగిన సూచనలు, సలహాలు అందజేయడంతో జిల్లాలో పనులు విజయవంతంగా కొనసాగుతున్నాయి.

నిధుల కొరత లేదు



జిల్లాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ప్రజాప్రతినిధులు గడప గడపకు తిరిగిన తరువాత నిధుల మంజూరు కోసం పనులను ప్రతిపాదిస్తున్నారు. వాటికి ఎప్పటికప్పుడు అనుమతులు ఇస్తున్నాం. ఇప్పటి వరకు రూ. 46.24 కోట్లతో 959 పనులు చేపట్టాం. జీజీఎంపీకి నిధుల కొరత లేదు.

– డాక్టర్ జి.సృజన, కలెక్టర్